క్లుప్తంగా

సత్ప్రవర్తనతో మెలగాలి



మాట్లాడుతున్న జడ్జి తంగమణి

డోన్ టౌన్ : వివిధ నేరాలతో శిక్షణను అనుభవిస్తున్న ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని సీనియర్ సివిల్ జడ్జి తంగమణి సూచించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా శుక్రవారం స్థానిక సబ్ జైలును జడ్జి పరిశీలించారు. ఈ సందర్భంగా ఖైదీలతో ఆమె సమావేశమై మాట్లాడారు. క్షణికావేశంతో నేరాలు చేసి కుటుంబాలకు దూరంగా ఉంటూ శిక్షలు అనుభవించాల్సిన పరిస్థితులు బాధాకరమన్నారు. అనంతరం ఖైదీల వివరాలు తెలుసుకుంటూ బైలు కోసం దరఖాస్తు చేసుకున్నారా లేదా అని ఆరా తీశారు. స్వతహాగా న్యాయవాదిని నియమించుకోవడానికి ఆర్థిక స్తోమత లేని వారికి ప్రభుత్వం తరుపున ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామన్నారు. అదేవిధంగా భోజన, వసతి, వైద్య సదుపాయాలపై ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో సబ్ జైల్ సూపరింటెండెంట్ రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

బేతంచెర్ల: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ ప్రియతం రెడ్డి, ఎస్ఐ శివ శంకర్ నాయక్ హెచ్చరించారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా బీఎస్ఎఫ్ దళాలతో శుక్రవారం మండల పరిధిలోని బుగ్గానిపల్లె, సిమెంట్ నగర్ గ్రామాల్లో కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల నిబంధనల అమలుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.

ఘనంగా నాగదేవతల విగ్రహ ప్రతిష్ట

ప్యాపిలి: స్థానిక స్వయంభూ ఈశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం నాగదేవతల విగ్రహ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవాచనం, నవగ్రహ పూజలు నిర్వహించారు. అనంతరం వేదమంత్రాల మధ్య నాగదేవతల విగ్రహాలు ప్రతిష్ఠించారు. అనంతరం మహామంగళహారతి న్విహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు కంచి రాంప్రతాప్ స్వామి, కంచి నరేశ్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

శాలివాహన చక్రవర్తి జయంతి

బనగానపల్లె రూరల్ : స్థానిక శాలివాహన సంక్షేమ సంఘం కార్యాలయంలో నియోజకవర్గ కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘం అధ్యక్షుడు సురేష్ ఆధ్వర్యంలో శుక్రవారం శాలివాహన చక్రవర్తి జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి స్వీట్స్ పంపిణీ చేశారు. శాలివాహన చక్రవర్తి త్యాగాలను ఈ సందర్భంగా సురేష్ గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు శివ రామద్దిలేటి, బాబాయ్య, నాగరాజు, సుబ్బయ్య, రవి, నాగేంద్ర, నాగమయ్య తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో బాలుడు మృతి

బేతంచెర్ల: పట్టణంలోని హనుమాన్ నగర్ కాలనీకి చెందిన ముత్యాల సుబ్బరాయుడు కొడుకు సాయితేజ (8) అనారోగ్యంతో మృతి చెందాడు. నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి సాయితేజ మృత దేహంపై పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు చందు రెడ్డి, తిరుమలేశ్వర్‌రెడ్డి, గోపాలు, నరసింహులు, మధు సూధన్, దుర్గా పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి వంటసామగ్రి విరాళం

డోన్ : స్థానిక వైఎస్ఆర్ నగర్‌లోని వృద్ధాశ్రమానికి శుక్రవారం పాతపేటకు చెందిన మనోహర్‌శెట్టి, ఇందిరాలత దంపతులు రూ.5వేల విలువ వంట సామగ్రిని విరాళంగా అందజేశారు. తమ కూతురు సాయి రమ్య పుట్టినరోజును పురస్కరించుకొని వంట సామగ్రిని ఆశ్రమ నిర్వాహకులు జాన్ ప్రభాకర్‌కు ఇచ్చారు.

ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందుతో పాల్గొన్న కాటసాని ఓబులరెడ్డి

బనగానపల్లె : పట్టణంలోని లాల్‌మసీద్‌లో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో మసీద్ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ యువనేత కాటసాని ఓబులరెడ్డి పాల్గొన్నారు. అనంతరం మసీద్ పేష్‌మాం సయ్యద్ మొహిద్దిన్, ఖాద్రీ, మౌజన్ అబ్బాస్ ఖాన్‌లను కాటసాని ఓబుల రెడ్డి సన్మానించారు. కార్యక్రమలో వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనార్టీ రాష్ట్ర నాయకులు అత్తార్‌జాహెద్, ఖానిక్, సర్దార్‌హుస్సేన్, శశి, గౌండ షరీఫ్, మక్బుల్, చైనా మాబు తదితరులు పాల్గొన్నారు.

ఉడుములపాడు... అభివృద్ధి చూడు!

- రూ.2.23 కోట్లతో అభివృద్ధి పనులు
- ప్రభుత్వ కార్యాలయాలు, సీసీ రోడ్లతో కళకళలాడుతున్న గ్రామం
- సంతోషం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



రూ.35 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం



రూ.21.80లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం



గ్రామంలో వేసిన సీసీ రోడ్డు

డోన్ రూరల్ : జాతిపిత కలలుగన్న గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పల్లెల అభివృద్ధికి పెద్దపీట వేసింది. పట్టణాలకు దీటుగా పల్లెలను అభివృద్ధి చేసింది. పంచాయతీలే కాదు మజరా గ్రామాలు సైతం అభివృద్ధిబాట పట్టాయి. ప్రతి పల్లెలో సంక్షేమం, అభివృద్ధి పరుగులు పెడుతుంది. ప్రత్యేకించి సచివాలయం, రైతుభరోసా కేంద్రాలు, హెల్త్ సెంటర్ భవనాలతో పల్లెలకు పట్టణశోభ వచ్చింది. గత ప్రభుత్వ నిర్లక్ష్యం మూలంగా నియోజకవర్గ కేంద్రం డోన్‌కు కూతవేటు దూరంలో ఉన్న ఉడుములపాడు సైతం అభివృద్ధికి ఆమడ దూరం అన్నట్లుగా ఉండేది. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రత్యేక చొరవతో నేడు ప్రభుత్వ కార్యాలయాలు, సీసీ రోడ్లతో ఉడుములపాడు కళకళలాడుతోంది. ఏకంగా రూ.2.23 కోట్లతో వసతులు కల్పించడంతో ఉడుములపాడు... అభివృద్ధి చూడు అన్నట్లుగా గ్రామం రూపురేఖలు మారిపోయాయి. గతంలో కనీస మౌలిక వసతులు కరువై ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడేవారు. ప్రత్యేకించి రహదారులు గుంతలమయంగా ఉండేవి. వర్షాకాలం పరిస్థితి మరీదారుణంగా ఉండేది. ప్రస్తుతం ప్రతి కాలనీ సీసీ రోడ్లతో మెరుస్తోంది. గ్రామంలో పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తూ మంత్రి బుగ్గనకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

గ్రామంలో జరిగిన కొన్ని అభివృద్ధి పనుల వివరాలు

- రూ.35 లక్షలతో గ్రామ సచివాలయం నిర్మాణం
- రూ.21.80లక్షలతో రైతు భరోసా కేంద్రం
- రూ.17.50 లక్షలతో హెల్త్ సెంటర్ నిర్మాణం
- రూ.15.10లక్షలతో పాల యూనిట్ కేంద్రం ఏర్పాటు
- రూ.20 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం
- రూ.5లక్షలతో బర్రెల గ్రౌండ్ ఏర్పాటు
- రూ.2.50లక్షలతో అంగన్‌వాడీ కేంద్రానికి ప్రహరీ నిర్మాణం

చాలా సంతోషంగా ఉంది



మా గ్రామం పూర్తిగా అభివృద్ధి చెందడం చాలా సంతోషంగా ఉంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేసింది. గతంలో ఎన్నడు లేని విధంగా నాడు, నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలలు, ఆసుపత్రులు అభివృద్ధి అయ్యాయి. పాఠశాలను పూర్తిగా రూపురేఖలు మార్చేశారు. మౌలిక వసతులు కూడా సమకూరాయి.

– నాగమద్దయ్య, ఉడుములపాడు

సచివాలయ సేవలు బాగున్నాయి



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థ సేవలు బాగున్నాయి. మండల కేంద్రానికి వెళ్లకుండా దాదాపు అన్ని పనులు గ్రామంలోనే అవుతున్నాయి. గతంలో ఏ చిన్నపని కావాలన్నా డోన్‌కు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడా ఇబ్బందులు తప్పాయి. ఆర్బీకేలు కూడా రైతులకు బాబా ఉపయోగపడుతున్నాయి.

– మండల్ల వీరాంజినేయులు, ఉడుములపాడు

ఎన్నికల నియమావళిని పాటించాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ మహేశ్వరరెడ్డి

డోన్ టౌన్ : ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ పూర్తిగా చదువుకుని తెలుసుకోవాలని, అత్యుత్సాహంతో నియమనిబంధనలు తెలుసుకోకుండి ఫిర్యాదులు చేయడం, ప్రకటనలు ఇవ్వడం, అభాండాలు మోపడం సరికాదని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, డోన్ ఆర్డీఓ మహేశ్వరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆర్డీఓ మాట్లాడారు. ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు శాశ్వత భవనాలు, నిర్మాణాలపై ఉన్న రాజకీయ నాయకుల, ఫొటోలు, పేర్లు, సంక్షేమ పథకాలకు సంబంధించి జారీ చేసిన ధృవపత్రాలపై ఉన్న అప్పటి ముఖ్యంత్రుల ఫొటోలను తొలగించడం ఎన్నికల కోడ్ కిందకు రాదన్నారు. ఎన్నికల కోడ్ వెలువడిన తరువాత జారీ అయ్యేవాటిపై ముఖ్యమంత్రులు, రాజకీయ పార్టీల పేర్లు ఉంచరాదన్నారు. అంతే కాకుండ కొన్ని శాశ్వత వనరులు పనులకు ప్రపంచ సూచికల ప్రకారం, నదులు, నీటికి నీలం రంగు అని, అయితే నీటి ట్యాంకులకు నీలం రంగు ఉందని... అది వైకాపా రంగు అని కొన్ని పత్రికలు అవగాహన రాహిత్యంతో ప్రచురించాయని అసంతృప్తి వ్యక్తం చేశారు.

144 సెక్షన్ అమల్లోకి

ఎన్నికల నియమావళిపై అనుసరించాల్సిన పద్ధతులపై స్థానిక కార్యాలయంలో ఆర్డీఓ డివిజన్ స్థాయిలో తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల కోడ్ ఈనెల 16 నుంచి అమలులోకి వచ్చిందని, ఇందుకు అనుగుణంగా 144 సెక్షన్ అమలు అవుతుందని గుర్తు చేశారు. నలుగురికి మించి ఒకే చోట గుమిగూడి ఉండరాదన్నారు. ఎన్నికల ప్రచారం కోసం గుంపులు గుంపులుగా తిరిగితే కోడ్ ఉల్లంఘించిన వారవుతుతారని, ప్రచారం కోసం అనుమతులు ఉంటేనే నలుగురి కంటే ఎక్కువ మంది ఉండొచ్చన్నారు. సమావేశాల్లో డోన్, బేతంచెర్ల తహసీల్దార్లు మాధవకృష్ణారెడ్డి, జీవన్ కిషోర్, ఏఓ రాజశేఖర్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా ప్రతినిధులు ఎన్నికల నిబంధనలు పాటించాలి

బనగానపల్లె రూరల్ : రాజకీయ పార్టీల సోషల్ మీడియా ప్రతి నిధులు తప్పనిసరిగా ఎన్నికల నిబంధలు పాటించాలని సీఐ గంటా సుబ్బారావు సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో రాజకీయ పార్టీల సోషల్ మీడియా ప్రతినిధులతో శుక్రవారం నిర్వహించిన సమావేశం సీఐ మాట్లాడారు. కులాలు, మతాలు, రాజకీయ పరంగా ప్రజలను రెచ్చగొట్టేలా పోస్టులు పెట్టరాదన్నారు. ప్రజలను భయభ్రాంతాలకు గురయ్యేలా, అల్లర్లు సృష్టించే అంశాలను వ్యాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్, యూట్యూబ్, టెలిగ్రామ్ తదితర వాటిల్లో పెట్టరాదని సూచించారు. సమాజంలోని సున్నితమైన అంశాలపై జాగ్రత్తగా వ్యవహరించాలని, ఎన్నికల నిబంధల ఉల్లంఘించే వ్యక్తులు ఎంతటివారైనా ఉపేక్షించమని, చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని సీఐ గంటా సుబ్బారావు హెచ్చరించారు.

జగనన్న సురక్ష.. ప్రజారోగ్యానికి రక్ష



రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ నాగేంద్ర

కోవెలకుంట్ల: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజల ఆరోగ్యానికి రక్షణగా నిలుస్తోందని కంపమల్ల సర్పంచ్ లోకేశ్వరరెడ్డి, భీమునిపాడు వైఎస్సార్‌సీపీ నాయకుడు అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని భీమునిపాడు గ్రామ సచివాలయ పరిధిలో శుక్రవారం రెండవ విడత ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. నంద్యాలకు చెందిన డాక్టర్లు భార్గవి, నాగార్జున, దొర్నిపాడు పీహెచ్‌సీ డాక్టర్ నాగేంద్ర, కంటి వైద్య నిపుణుడు గంగాధర్ ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరాన్ని ఎంపీడీఓ సయ్యదున్నీసా, ఈఓపీఆర్‌డీ రాధిక పర్యవేక్షించారు. సచివాలయ పరిధిలోని గ్రామాలకు చెందిన 250 మందికి ఆరోగ్య పరీక్షలు చేసి అవసరం మేరకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ కన్వీనర్లు వెంకటేశ్వరరెడ్డి, వీరారెడ్డి, పంచాయతీ కార్యదర్శి నాగలక్ష్మి పాల్గొన్నారు.

'పది' పరీక్షా కేంద్రాల తనిఖీ

ప్యాపిలి: స్థానిక బాలుర, బాలికల ఉన్నత పాఠశాలతో పాటు జలదుర్గం ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్షా కేంద్రాలను శుక్రవారం ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం రామసుబ్బయ్య, శ్రీనివాసులు తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు జరుగుతున్న తీరును వారు ఎంఈఓ వెంకటేశ్ నాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేవిధంగా చూడాలని పరీక్షా కేంద్రాల చీఫ్‌లను వారు ఆదేశించారు.

సంజామల: మండల పరిధిలోని కానాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జరుగుతున్న పది పరీక్షా కేంద్రాన్ని శుక్రవారం ఆళ్లగడ్డ ఎంఈఓ, ఫ్లయింగ్ స్క్వాడ్ బాల గంగధర్ తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుబాటులో తాగునీరు ఉంచాలని ఆయన పరీక్ష నిర్వహకులకు సూచించారు. కానాల సెంటర్‌లో 197 మంది విద్యార్థులుగాను 39 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని సెంటర్ చీఫ్ సుదర్శన్ రావు తెలిపారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

కోవెలకుంట్ల: మండలంలోని గుళ్లదూర్తిలో జీర్ణోద్ధరణ గావించిన పలు ఆలయాల్లో శనివారం నుంచి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఆయా ఆలయాల్లో భద్రకాళీ సమేత వీరభద్రేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ, బసవేశ్వర, వీరబ్రహ్మేశ్వరుల స్వామి ధ్వజ, శిఖర కళశ, కుంభాభిషేకం, తదితర కార్యక్రమాలు మూడు రోజులపాటు కొనసాగనున్నాయి. మొదటి రోజు గంగానయనము, గణపతి పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, అంకురారోపణము, 24న ప్రాతఃకాలపూజ, అవాహిత దేవతా హోమాలు, గణపతి, రుద్ర, నవగ్రహ, చండీ, సుదర్శన హోమాలు జరుగుతాయని వేదపండితులు పేర్కొన్నారు. ఉత్సవాల్లో 25న దీక్షా హోమాలు, ప్రతిష్ఠాహోమాంగ, విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, తదితర పూజలు సాగుతాయని వివరించారు.

నేటి నుంచి కాసూటిలో....

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని పెట్నికోట సమీపంలోని కాసూటి కాశి విశ్వేశ్వరస్వామి ఆలయంలో శనివారం నుంచి మూడు రోజుల పాటు విగ్రహ ప్రతిష్ఠ పూజలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డితో పాటు దాతల సహకారంతో ఆలయాన్ని జీర్ణోద్ధరణ చేపట్టారు. వేదపండితులు రాచకొండ పార్థసారథిశర్మ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు విశేష పూజలు నిర్వహించిన అనంతరం 25న మహా గణపతి, పార్వతి, పరమేశ్వర, నంది, ధ్వజస్తంభ ప్రతిష్ఠ నిర్వహిస్తామన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే పేదలకు న్యాయం

- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి



ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే కుల,మతాలు, పార్టీలకతీతంగా పేదలందరికీ సంపూర్ణ న్యాయం జరిగిందని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి తెలిపారు. మండల కేంద్రం కొలిమిగుండ్లలో శుక్రవారం వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రధాన వీధుల్లో పర్యటించి ప్రజలతో మాట్లాడి ప్రభుత్వం చేసిన మేలును వివరించారు. ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తించిన తీరును విశదీకరించారు. అదేవిధంగా సమస్యలపై ఆరా తీశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వంలో అన్ని వర్గాలు ప్రజలు సంతోషంగా గడుపుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కుటుంబంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేశామన్నారు. గత టీడీపీ ప్రభుత్వ పాలనలో ఎలా ఉండేదో ఒక్క సారి ప్రజలు ఆలోచించాలని కోరారు. సంక్రాంతి పండగకు చంద్రన్న కానుక పేరుతో పాడైపోయిన సరుకులు ఇచ్చి చేతులు దులుపుకోవడం తప్పా ఒక్క సంక్షేమ పథకాన్ని టీడీపీ ప్రభుత్వం అమలు చేయలేక పోయిందని విమర్శించారు. మంచి చేసిన ప్రభుత్వాన్ని మళ్లీ తెచ్చుకుంటే ప్రతి కుటుంబం మరింతగా ఆర్థికాభివృద్ధి చెందుతుందని చెప్పారు. టీడీపీ నాయకులు ఎన్నికల సమయంలో తప్ప మిగతా సమయంలో కనిపించరని, వారి మాయ మాటలు నమ్మి మోసపోతే ఐదేళ్ల పాటు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ప్రజల వద్దకు పాలన కొనసాగించేందుకు మరోమారు సీఎం జగనన్నను ఆశీర్వాదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు వెంకట రమణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు పేరం సత్యనారాయణరెడ్డి, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లాయర్ మహేశ్వరరెడ్డి, నాయకులు పేరం నందకిషోర్‌రెడ్డి, సూర్య నారాయణరెడ్డి, మూల ఈశ్వరరెడ్డి, బీగాల వెంకటసుబ్బయ్య, ఎంకె నాయుడు, రామసుబ్బయ్య, నాగేశ్వరరావు, రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

బీహార్ మహిళ ఆత్మహత్య

బనగానపల్లె రూరల్ : పట్టణంలోని యాగంటిపల్లె రహదారిలో ఉన్న పాలిమార్స్ కంపెనీ సమీపంలో బీహార్ రాష్ట్రానికి చెందిన వివాహిత చంపాదేవి(29) ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిందని ఎస్ఐ రామిరెడ్డి శుక్రవారం తెలిపారు. చాహన్‌పూర్ గ్రామానికి చెందిన బబ్లూ తోహన్, చంపాదేవి దంపతులు పాలిమార్స్ ఫ్యాక్టరీలో పని చేస్తూ అక్కడే నివాసం ఉన్నారు. గత రాత్రి భార్య, భర్తలు కుటుంబ సమస్యల కారణంగా వాగ్వాదం చేసుకున్నారు. దీంతో చంపాదేవి రూమ్‌లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాలిక కిడ్నాప్ – కేసునమోదు

బేతంచెర్ల: మండల పరిధిలోని కొలుములపల్లె గ్రామానికి చెందిన 13 సంవత్సరాల బాలికను అదే గ్రామానికి చెందిన యువకుడు గోరంట్ల మహేష్ (ఆలీయాస్ మౌలాలీ) గురువారం కిడ్నాప్ చేశాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు నిందితునిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివ శంకర్ నాయక్ తెలిపారు. శుక్రవారం నిందుతుడు గోరంట్ల మహేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ మేరకు నిందుతుని డోన్ కోర్టుకు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ వెల్లడించారు.

25న కాశిరెడ్డినాయన ఆరాధన ఉత్సవాలు

డోన్ : మండల పరిధిలోని జగదుర్తి గ్రామం వద్ద వెలసిన కాశిరెడ్డినాయన ఆలయ పదవ వార్షికోత్సవం ఈనెల 25న ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు కాశిరెడ్డినాయన భక్త బృందం సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల సందర్భంగా న్యూ కేటగిరి ఎద్దులకు బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ముచ్చట్ల మల్లికార్జున స్వామి హుండీ లెక్కింపు

బేతంచెర్ల: మండలపరిధిలోని హెచ్ కొట్టాల గ్రామ సమీపాన వెలసిన ముచ్చట్ల భ్రమరాంభ, మల్లికార్జున స్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లకు భక్తులు సమర్పించిన కానుకల హుండీ లెక్కింపు దేవాదాయ శాఖ తనిఖీ అధికారి శ్రీనివాస్ రెడ్డి పర్యవేక్షణలో శుక్రవారం నిర్వహించారు. 10 నెలలకు సంబంధించి హుండీ మొత్తాన్ని లెక్కించగా రూ.1,09,884 వచ్చినట్లు ఈఓ మద్దిలేటి తెలిపారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ జగన్ మోహన్ రెడ్డి, అర్చకులు చంద్ర మోహన్ రావు, భక్తులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

డోన్ టౌన్ : ప్రయాణికులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించే ఉద్దేశంతో వారి సలహాలు, సూచనలు స్వీకరించడానికి శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ శశిభూషణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు, ప్రయాణికులు ఉదయం 11 నుంచి 12 గంటల మధ్యలో సెల్ నంబరు 9959225795కు ఫోన్ చేసి తమ అమూల్యమైన సూచనలు, సలహాలతోపాటు ఏదైనా ఫిర్యాదులు చేయొచ్చన్నారు. ప్రజలు మంచి సూచనలు చేసి ఆర్టీసీ అభివృద్ధికి సహకరించాలని ఈ సందర్భంగా డీఎం కోరారు.

డ్రైన్లు ఆక్రమిస్తే కఠిన చర్యలు

డోన్ : మున్సిపల్ పరిధిలో డ్రైనేజీలను ఆక్రమించి అక్రమ కట్టడాలు నిర్మించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని కమిషనర్ డాక్టర్ జయరాం హెచ్చరించారు. స్థానిక 24వ వార్డులోని జంగాల కాలనీలో శుక్రవారం డీఈ రసూల్, ఏఈ సతీష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషాలతో కలిసి ఆయన స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కాలనీలో పలుచోట్ల డ్రైనేజీల్లో పేరుకపోయిన పూడికను గమనించిన కమిషనర్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే కాల్వలను శుభ్రం చేయాలని ఆదేశించారు. ఇదే కాలనీలో రోడ్డుపై కల్వర్టు పగిలిపోయిన విషయాన్ని స్థానికులు ఆయన దృష్టికి తీసుకురాగా వెంటనే మరమ్మతులు చేయించాలని ఆదేశించారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలి



ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న బుగ్గన అర్జున్‌రెడ్డి

డోన్ : వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తనయుడు బుగ్గన అర్జున్ రెడ్డి ప్రజలను కోరారు. పట్టణ పరిధిలోని రెండవ వార్డులో కౌన్సిలర్ శివలక్ష్మి, వార్డు ఇన్‌చార్జ్ కుళ్లాయిల ఆధ్వర్యంలో శుక్రవారం గడపగడపకు తిరిగి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన కాలనీలో నెలకొన్న సమస్యలను స్థానికులతో అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అమలు చేసిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, మున్సిపల్ వైస్‌చైర్మన్ జాకీర్‌హుసేన్, నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం అధ్యక్షుడు పోస్టు పసాద్, నాయకులు దినేష్‌గౌడ్, రఫీ, వంశి, రాజ్‌కుమార్, సతీష్, దుబాయ్ శ్రీను, అశోక్, సురేష్, కౌన్సిలర్లు రైల్వే నాగేంద్ర, ఆర్ట్ రమణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ పనుల వేలం వాయిదా

కోవెలకుంట్ల: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీకి ఆదాయం చేకూర్చే వివిధ పనుల నిర్వహణకు శుక్రవారం నిర్వహించాల్సిన వేలంపాట వాయిదా వేసినట్లు ఈఓ గోపినాథ్ తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సంతమార్కెట్, దినమార్కెట్, బస్టాండ్ గేటు వసూలు, కమేళా పనుల నిర్వహణకు వేలాలు జరపాల్సి ఉందన్నారు. సార్వత్రిక ఎన్నికల కోడ్ నేపథ్యంలో వేలాలను తాత్కాలికంగా వాయిదా వేశామన్నారు. గతేడాది వేలంపాటలో పనులు దక్కించుకున్న వ్యక్తులకే మరో మూడు నెలలు గేటు వసూళ్లకు గడువు పొడగించామన్నారు. ఎన్నికలు ముగిశాక వేలాలు నిర్వహిస్తామని వెల్లడించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

బేతంచెర్ల: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని సంజీవ నగర్ కాలనీకి చెందిన 10 సంవత్సరాల చిన్నారికి డెంగీ సోకడంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. ఈ మేరకు ఆయన సంజీవనగర్ కాలనీని పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. అనంతరం కాలనీలో కాలువలను శుభ్రం చేయించి, స్ప్రేయింగ్ చేయించి, ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

తెలుగు తమ్ముళ్లు... మభ్యపెట్టారు!

- 24 గంటల్లోనే సొంత గూటికి నందిపాడు నాయకులు
- ఎమ్మెల్యే కాటసాని, జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిక
- కొలిమిగుండ్లలోనూ టీడీపీకి భారీ షాక్



వైఎస్సార్‌సీపీలో చేరిన నందిపాడు నాయకులతో ఎమ్మెల్యే కాటసాని, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల

కొలిమిగుండ్ల: ఎలాగైనా అధికారంలోకి రావాలనే ఉద్దేశంతో ప్రలోభాలు, మాయ మాటలు చెప్పి టీడీపీలోకి చేర్చుకొని తమ పార్టీ బలంగా ఉందని చెప్పుకునేందుకు చేస్తున్న కుట్రలు బయటపడుతూనే ఉన్నాయి. నందిపాడుకు చెందిన నాయకులు టీడీపీలో చేరిన 24 గంటలలోపే తిరిగి వైఎస్సార్‌సీపీలో చేరడంతో తెలుగు తమ్ముళ్లు ఖంగుతిన్నారు. శుక్రవారం కొలిమిగుండ్లలోని పార్టీ కార్యాలయంలో నందిపాడు సర్పంచ్ గుర్విరెడ్డి ఆధ్వర్యంలో ఆ ఏడు కుటుంబాలకు చెందిన శ్రీనివాసరెడ్డి, బొజ్జ సుబ్బారెడ్డి, రమణయ్య, మస్తాన్, చాకలి మద్దిలేటి, బిరుసంటి ప్రసాద్, సుబ్బరాయుడులు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి సమక్షంలో తిరిగి వైఎస్సార్‌సీపీలో చేరారు. టీడీపీ నాయకులు గ్రామంలో ఆలయం నిర్మిస్తాం, బోర్లు వేయిస్తామని చెప్పి బనగానపల్లెకు తీసుకెళ్లి కండువాలు కప్పారు. తెలుగు తమ్ముళ్లు మభ్యపెట్టారనే విషయాన్ని గుర్తించిన నందిపాడు నాయకులు తిరిగి సొంతపార్టీ వైఎస్సార్‌సీలో చేరారు.

కొలిమిగుండ్లలోనూ...

మండల కేంద్రం కొలిమిగుండ్లలో టీడీపీకి గట్టిషాక్ తగిలింది. కొద్ది రోజుల క్రితం టీడీపీ నాయకులు ప్రతి ఇళ్లు తిరిగి అధికారంలోకి వచ్చేది మేమే అని అబద్ధపు మాటలు చెప్పి టీడీపీలో చేర్చుకున్నారు. టీడీపీ నాయకుల మాయ మాటలు నమ్మకం లేకపోవడంతో వైఎస్సార్‌సీపీ నాయకులు పేరం సత్యనారాయణరెడ్డి సోదరుల ఆధ్వర్యంలో చెన్నకేశవ స్వామి ఆలయం సమీపంలోని కాలనీలకు చెందిన 48 కుటుంబాలు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. అంపినేని శ్రీనివాసులు, కంబగిరిస్వామి, ఏసు, శివ, చిన్న నారాయణ, సూర్యుడు, రాముడు, చిన్న నరసింహుడు, అంజి, సాయి, పెద్దయ్య, పుల్లయ్య హరి, అఖి, రామయ్య, కంబగిరి, అంకన్న, మొడగట్టు నారాయణమ్మ, సరస్వతితో పాటు 44 వార్డుకు చెందిన గూటం ఆంజనేయులుకు ఎమ్మెల్యే కాటసాని, జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి కండువాలు కప్పి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు.

సారా కేసు నిందితులకు రిమాండ్

అవుకు: మండల పరిధిలోని రామాపురం, చెర్లోపల్లె గ్రామాలకు చెందిన నలుగురిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ కిరణ్ బాబు శుక్రవారం తెలిపారు. రామాపురం గ్రామానికి చెందిన జయలక్ష్మిభాయి, దస్తగిరమ్మలపై ఈనెల 21వ తేదీన, చెర్లోపల్లె గ్రామానికి చెందిన ఈడిగ శివమ్మ, నక్కల దేవిపై జనవరి 26వ తేదీన నాటుసారా కేసులు నమోదు అయ్యాయన్నారు. నలుగురిని రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ తెలిపారు.